
చిరంజీవి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

## చిరంజీవి కుటుంబానికి 'ఎర్రబెల్లి' పరామర్శ

దేవరుప్పుల, డిసెంబర్ 7 : ధర్మాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల యువజన నాయకుడు వంగాల చిరంజీవి బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిరంజీవి మృతదేహాన్ని గురువారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో వంగాల చిరంజీవి తన కోసం పడ్డ కష్టాన్ని గుర్తు చేసుకుని విలపించారు. చిరంజీవిలాంటి చురుకైన నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. చిరంజీవి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. దయాకర్‌రావు వెంట దేవరుప్పుల మండల బీఆర్‌ఎస్ నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బస్వ మల్లేశ్, చింత రవి, ఏల సుందర్, కొల్లూరు సోమయ్య, కోతి ప్రవీణ్, నవీన్‌నాయక్, హనుమంతు, గడ్డం రాజు, మహేశ్, ఐరుకుల సతీశ్, జోగు సోమనర్సయ్య, జెరిపోతుల సాయిలు, పరశురాములు, మేడ వెంకట్, మేడ రాందయాకర్, భద్రి, తోకల రాజు తదితరులు ఉన్నారు.


రంగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## 'రంగయ్య మృతి సీపీఎంకు తీరని లోటు'

బచ్చన్నపేట, డిసెంబర్ 7 : మండలంలోని వీఎస్సార్.నగర్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చింతల రంగయ్య మృతి పార్టీకి తీరని లోటని జనగామ, సిద్దిపేట సీపీఎం జిల్లాల కార్యదర్శులు మోకు కనుకారెడ్డి, ఆముదాల మల్లారెడ్డిలు అన్నారు. గురువారం రంగయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే నేత రంగయ్య అని అన్నారు. ఎక్కడ ఏ సమావేశం ఏర్పాటు చేసినా, సభలు పెట్టినా ఎర్రజెండా చేబూని రంగయ్య హాజరయ్యేవాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, నాయకులు అన్నెబోయిన శ్రీనివాస్, పర్వతం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

## మిత్రుడికి పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం

రఘునాథపల్లి, డిసెంబర్ 7 : మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన గ్యార నాగరాజు కొద్ది రోజులుగా లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తనతో విద్యను అభ్యసించిన 2000-2001బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు గురువారం ఆయనను కలిసి పరామర్శించారు. ఆరోగ్య విషయాన్ని అడిగి తెలుసుకొని ఆసుపత్రి ఖర్చు నిమిత్తం రూ.16వేలు ఆర్థిక సాయం అందించారు. నాగరాజు కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన వారిలో బిర్రు నగేశ్, గాజులపాటి వీరోజీ, తిప్పారపు భాస్కర్, గర్వందుల వేణు తదితరులు ఉన్నారు.


లకావత్ తండాలో రైతులకు దూడలను అందిస్తున్న మహేశ్ అగర్వాల్


కొడకండ్ల : రైతులకు గోవులను అందజేస్తున్న గోశాల నిర్వాహకులు

# పశు సంపదతో రైతు కుటుంబాలకు మేలు

- **గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేశ్ అగర్వాల్**
- **రైతులకు ఉచితంగా గోవుల పంపిణీ**

దేవరుప్పుల, డిసెంబర్ 7 : వ్యవసాయ కుటుంబంలో ఇంటికో ఆవు ఉండాలని, గోమాత ఇంటిల్లిపాది ఆరోగ్యానికి మేలు చేస్తుందని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. మండలంలోని లకావత్ తండా తూర్పు గ్రామపంచాయతీలో గురువారం పరమేశ్వర గోశాల ఆధ్వర్యంలో గోపంపిణీ కార్యక్రమం జరుగగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు ఉచితంగా గోవులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి రైతన్న వెన్నెముక కాగా, ప్రాచీన కాలంలో రైతులకు గోవులు వెన్నెముకగా నిలిచేవని తెలిపారు. రానురాను యాంత్రిక యుగంలో గోవులు కనుమరుగవుతున్నాయని ఆయన అన్నారు. గోవు వల్ల అనేక లాభాలు ఉన్నాయని, ప్రతి రైతు గోవులను సాకాలన్నారు. రైతులు గోవులను పెంచాలని ఉత్సాహం చూపితే తాము ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మహేశ్‌అగర్వాల్ తెలిపారు. భక్తులు శివాలయాల్లో సమర్పించే లేగదూడలను గోశాలల్లో సాకుతుండగా వాటిని రైతులకు అందజేస్తామన్నారు. కాగా తండాకు చెందిన 10మంది రైతులకు 20లేగదూడలను మహేశ్ అగర్వాల్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గోశాల సూపరింటెండెంట్ దుర్గం రోజా, సర్పంచ్ లకావత్ సత్యమ్మనెహ్రూ, వార్డు సభ్యులు లకావత్ క్రాంతి, పరమేశ్వర గోశాల ప్రతినిధులు లకావత్ అశోక్, భూక్యా లక్కు ఉన్నారు.

**పశు సంపదతోనే నాణ్యమైన వ్యవసాయం**

కొడకండ్ల : పశు సంపదతోనే నాణ్యమైన వ్యవసాయ సాధ్యమవుతుందని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ అన్నారు. గురువారం మండలంలోని నీలిబండ తండాలో యాకన్న గోశాల ఆధ్వర్యంలో 10మంది రైతులకు ఉచితంగా గోవులను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ అగర్వాల్ మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి రైతు వెన్నుముక అని, అలాంటి రైతులకు భరోసా కల్పించి పశు సంపదను అందించడం కంటే గొప్ప సంపద లేదని అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దుర్గం రోజా, సర్పంచ్ విమలసోమాని, వార్డు సభ్యులు, గోశాల కార్యదర్శి రాములునాయక్ పాల్గొన్నారు.

## 12న జాబ్ మేళా

జనగామ చౌరస్తా, డిసెంబర్ 7 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు అపోలో ఫార్మసీ (హైదరాబాద్)లో ఉద్యోగాలు కల్పించడానికి ఈ నెల 12న (మంగళవారం) ఉదయం 10.30 గంటలకు జనగామ కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి సీహెచ్ ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్ (మేల్, ఫిమేల్) 50, ట్రైనీ ఫార్మాసిస్ట్ (మేల్) 50, ఫార్మసీ అసిస్టెంట్ (మేల్) 50, రిటైల్ ట్రైనీ అసోసియేట్ (మేల్) 50, ప్రాడక్ట్ అడ్వైజర్ (మేల్/ఫిమేల్) 25 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డీ ఫార్మసీ/బీ ఫార్మసీ/ఎం ఫార్మసీ విత్ పీసీఐ పూర్తి చేసిన నిరుద్యోగులు అర్హులని ఆమె తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరుకావాలని ఉమారాణి కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జే గీతను సెల్ నంబర్ 7995430401 లో సంప్రదించాలన్నారు.


సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

## సీజనల్ జ్వరాలపై సర్వే

పాలకుర్తి, డిసెంబర్ 7 : మండల కేంద్రంలో పలు కాలనీల్లో ఆరోగ్యసిబ్బంది గురువారం సీజనల్ జ్వరాలపై ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రజల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు కలిగినా తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరం మేరకు మందులు వాడాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ప్రవంతి, ఆశ కార్యకర్తలు వాడిక సరిత, సరిత పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ

ములుగురూరల్, డిసెంబర్ 7 : రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో ములుగు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా కేంద్రానికి చెందిన సైన్‌రైజర్స్ పాఠశాల విద్యార్థులు తక్కళ్లపల్లి యశ్వంత్‌రావు, పీ వంశీకృష్ణ, పీ దినేశ్‌లు ఎగ్జిబిట్లను ములుగు జిల్లా తరఫున ప్రదర్శించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పెట్టెం సోమ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, శోధించే ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు తయారు చేసేందుకు దోహదపడుతాయని అన్నారు.

## సీఎం ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

బచ్చన్నపేట, డిసెంబర్ 7 : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బచ్చన్నపేట మండలం నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు మసూద్, నల్లగొని పుష్పాబాలకిషన్‌గౌడ్, ఆల్వాల రాధ, ఎల్లయ్య, కిసాన్ కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, జిల్లా నాయకులు చెరుకూరి శ్రీనివాస్, భాస్కరాచారి, జంగిటి నరేశ్‌లతోపాటు అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు బయలుదేరివెళ్లారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, జ్యోతీభాస్కర్, కరుణాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గొల్లపల్లి ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

## 'తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి'

జఫర్‌గఢ్, డిసెంబర్ 7 : మిగ్‌జాం తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. జఫర్‌గఢ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో తుఫాన్ వల్ల చేతి కొచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన పంటలను ప్రభుత్వం అధికారులతో క్షేత్ర స్థాయిలో సర్వే చేయించి పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని సోమయ్య కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి ఆహార పంటలకు రూ.20వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేల చొప్పున చెల్లించాలని సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, కుమార్, సోమయ్య పాల్గొన్నారు.


## విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

జఫర్‌గఢ్, డిసెంబర్ 7 : మండలంలోని కూనూరులో రైతు నల్లబెల్లి జంపయ్యకు చెందిన దుక్కిటెద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గురువారం మృతి చెందింది. బాధిత రైతు జంపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రోజు పనిలో భాగంగా తనకున్న ఎద్దులను గురువారం ఉదయం వ్యవసాయ పనులు పూర్తి కాగానే మేతకు వదిలినట్లు తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ బావి వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందికి ఉండడంతో మేతకు వెళ్లిన ఎద్దు వేలాడుతున్న విద్యుత్ వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందని రైతు జంపయ్య రోదిస్తూ తెలిపాడు. సుమారు రూ.75వేల విలువ చేసే దుక్కిటెద్దు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు, కుటుంబ సభ్యులు కోరారు.


విద్యుదాఘాతంతో మృతి చెందిన దుక్కిటెద్దు

## 'పాగాల'కు బీఆర్‌ఎస్ నాయకుల నివాళి

చిల్పూరు, డిసెంబర్ 7 : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జనగామ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం మండలంలోని కొండాపూర్‌లో సర్పంచ్ లోడెం రజితారవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు గాలి ప్రవీణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు భారీగా హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలిశాల కనుకయ్య, మారబోయిన ఎల్లయ్య, నాయకులు ప్రకాశ్, కొండ తిరుపతి, శ్రీనివాస్, సతీశ్, రవీందర్, శ్రీధర్, హరీశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


సంపత్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ రజితారవీందర్, గ్రామ అధ్యక్షుడు ప్రవీణ్